తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-18-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 113 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# కేటీఆర్ తన వైఖరి స్పష్టం చేయాలి

**ములుగు జిల్లా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశం**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

900 మంది రైతులకు నష్టపరిహారం అందించినందుకు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పార్టీ కార్యకర్త అని అంటారా.. కేటీఆర్ రైతు పక్షపాత దళారే పక్షాన ఉంటాడా తన వైఖరి స్పష్టం చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

మిగతా 2లో

# సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి

- తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములమవుదాం
- తెలంగాణను ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దుకుందాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది
- మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఆవిష్కృతమైన తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి సాధించుకోకపోతే భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసిన వారిగా మిగిలిపోతామని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములమవుదాం. అందుకు అందరం ప్రతిజ్ఞ తీసుకుందాం. ఈ తెలంగాణను ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దుకుందాం. ఎజెండాలు, జెండాలు పక్కన పెట్టి ప్రభుత్వం ప్రణాళికా బద్ధం చేస్తున్న అభివృద్ధిలో కలిసిరండి. ఈ ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం అండగా ఉన్నంత కాలం ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తాం.

మిగతా 2లో



# తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలి

- తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలి
- విద్యా రంగంపై అయ్యే వ్యయానికి ప్రభుత్వం వెనుకాడదు
- ` విద్యపై చేసే వ్యయాన్ని వ్యయంగా కాక పెట్టుబడిగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాం
- రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో

మిగతా 2లో

# ఆయన కలలను నిజం చేయడానికే ప్రధాని మోదీ కృషి : రాజ్‌నాథ్ సింగ్

- పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు
- హాజరైన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- పికెట్ పార్క్‌లో వాజ్‌పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్‌నాథ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. సర్దార్? వల్లభాయ్ పటేల్ సమర్థత వల్లే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసిందన్న రక్షణమంత్రి పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

మిగతా 7లో




# ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తాం

- తీన్మార్ మల్లన్న కొత్త పార్టీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించడం వల్లే తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశామన్న మహేశ్ గౌడ్
- తెలంగాణ విలీన దినోత్సవానికి, కవితకు ఏం సంబంధమని ప్రశ్న

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ విలీనంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీ లేదంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కవితకు చరిత్రపై అవగాహన లేదంటూ ఆయన విమర్శించారు. ''అసలు కవిత ఎప్పుడు పుట్టారు? ఆమెకు చరిత్ర తెలుసా?'' అంటూ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ విలీన దినోత్సవానికి, కవితకు ఏం సంబంధమని ఆయన నిలదీశారు.

మిగతా 2లో



# రాష్ట్రంలో నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

- తెలంగాణలో పూర్తిగా నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు
- రూ.1400 కోట్లకు పైగా బకాయిలే కారణమంటున్న ఆసుపత్రులు
- సేవలు కొనసాగించాలని ప్రైవేటు యాజమాన్యాలకు దామోదర విజ్ఞప్తి
- తాము నెలకు రూ.100 కోట్లు ఇస్తున్నామని మంత్రి వెల్లడి
- ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలకు అనూహ్యంగా బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలను

మిగతా 2లో

# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ

- తీన్మార్ మల్లన్న నుంచి కొత్త రాజకీయ పార్టీ ప్రకటన
- 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (టీఆర్పీ)గా నామకరణం
- పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మల్లన్న
- అధ్యక్షుడిగా మల్లన్న, ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం
- ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి అవకాశం

7లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యా వేత్తలు, నిపుణులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. నూతన విద్యా విధానం రూపకల్పనలో పరిగణలోకి తీసుకోవలసిన పలు అంశాలను ఈ సందర్భంగా వివరించారు. విద్యా రంగంపై అయ్యే వ్యయానికి ప్రభుత్వం వెనుకాడదని, ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించామని తెలిపారు. విద్యపై చేసే వ్యయాన్ని వ్యయంగా కాక పెట్టుబడిగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు.

విద్యాభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్బీఎం పరిమితి నుంచి తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారిని కోరామని తెలిపారు. తెలంగాణ విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరమని పేర్కొన్నారు. విద్యా రంగంలో ఇప్పటి వరకు తాము చేసిన కార్యక్రమాలపై సంతృప్తి చెందడం లేదని, ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని చెప్పారు. డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని వెల్లడిరచారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకొని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని కోరారు. వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. విద్యా రంగానికి భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయని, నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడడం విశ్లేషించారు.

ప్రభుత్వ పాఠశాలలు సైతం ఆ రకమైన ధీమా కల్పించగలిగితే తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారని, తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

ప్రస్తుత పరిస్థితుల్లో పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని అన్నారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం, నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని వివరించారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు.

మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సీఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యా ప్రమాణాలు ఆ స్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని ముఖ్యమంత్రి గారు ఆవేదన వ్యక్తం చేశారు.

కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని చెప్పారు. అయితే మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని ముఖ్యమంత్రి గారు గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టేలా వారికి ప్రమోషన్లు, బదిలీలు చేశామన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టామని తెలిపారు. మన విద్యా విధానం భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో ఉండాలని సూచించారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను ఏటీసీ కేంద్రాలుగా మార్పు చేయడం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ స్థాపన జరిగిందన్నారు. విద్యా వ్యవస్థ వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం కాకుండా నిరుపేదలకు ప్రయోజనకరంగా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులను అంతా ఒకటే అనే భావన కలిగించేలా విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. తెలంగాణ విద్యా విధానం దేశానికి దిక్సూచిలా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా విధానం ఛైర్మన్ కేశవరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ పాటు నిపుణులు పలు సూచనలు చేశారు.

# సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతానని, అందుకు మీ అందరి సహకారం, ఆశీర్వాదం ఉండాలి'' అని ప్రజాపాలన దినోత్సవ వేదిక నుంచి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

నిజాం నియంతృత్వ పాలనపై సాయుధ పోరాటంతో సామాన్యుడు సాధించుకున్న విజయానికి గుర్తుగా సెప్టెంబర్ 17 న నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.





“నిజాం నిరంకుశ పాలనపై జరిగిన పోరాటంలో 1948, సెప్టెంబర్ 17 రోజున ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛా పతాకను ఎగుర వేసిన రోజు. అందుకే ఇది ప్రజా పాలన దినోత్సవం. రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను.

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి. అదే విధంగా డిసెంబర్ 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలు రాయి. 77 ఏళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, పోరాట చరిత్రను, ఇక్కడ ఉద్భవించిన ఉద్యమాల సరళిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని మేం ఈ రోజు పరిపాలన చేస్తున్నాం.

అహంకారపు ఆలోచనలు, బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావు లేదు. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో పంచుకుంటున్నాం. ప్రజల ఆకాంక్షలు, వారి ఆలోచననే ప్రమాణికంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. తీసుకున్న నిర్ణయాలలో మంచి చెడులను విశ్లేషించే అవకాశం ఇస్తున్నాం. తప్పులుంటే దిద్దుకుంటున్నాం. మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నాం. అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలన్న తపనతో పని చేస్తున్నాం. విద్యనే మన విజయానికి వజ్రాయుధం అని మేం నమ్ముతున్నాం. గొప్ప విజన్‌తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల ఆలోచన చేశాం. భవిష్యత్‌లో తెలంగాణ విద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఈ స్కూళ్లు కేంద్రాలుగా మారబోతున్నాయి. విద్యపై మేం చేస్తున్న వ్యయం ఖర్చు కాదు. భవిష్యత్ తెలంగాణకు పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. రాష్ట్ర విద్యా పాలసీని త్వరలో తీసుకురాబోతున్నాం.

మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి'' నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్, మహిళా మార్ట్ లు అందుకు నిదర్శనం.

హరిత విప్లవం నుండి ఉచిత విద్యుత్ వరకు, రుణమాఫీ నుండి రైతు భరోసా వరకు రైతుల కోసం మనం రూపొందించిన సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు కొత్త చరిత్రను సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణాలు మాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులను ఆదుకున్నాం. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసి పెట్టుబడికి భరోసా ఇచ్చాం. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదు. కేవలం ఏడాది కాలంలో లక్షా నాలుగు వేల కోట్ల రూపాయలు రైతుల ప్రయోజనాలపై ఖర్చు చేసిన ప్రభుత్వం ఈ దేశంలో మరొకటి లేదు.

ప్రజా ప్రభుత్వం తొలి 20 నెలల్లోనే ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సుమారు 60 వేల ఉద్యోగాల భర్తీ చేశాం. సివిల్ సర్వీసెస్ అభ్యర్థులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం.

భూ పోరాటాల చరిత్రనే తెలంగాణ చరిత్ర. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి కారణంగా తెలంగాణ రెవెన్యూ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైంది. అందుకే భూ భారతి చట్టం తెచ్చాం. క్షేత్ర స్థాయిలో ఈ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు ఇటీవలే 5 వేల మంది గ్రామ పాలనా అధికారులను నియమించాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గ్రామాల్లో పేదల ఆత్మగౌరవ ప్రతీకలు. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్నప్పుడు ఆ పేదల కళ్లలో చూసిన ఆనందం నాకు ఎనలేని తృప్తినిచ్చింది. సన్న బియ్యం సంక్షేమ పథకానికి ఈ రోజు కేరాఫ్ అడ్రస్ తెలంగాణ. దేశంలో మరే రాష్ట్రంలో ఇటువంటి పథకం లేదు. రాష్ట్రంలోని 3.10 కోట్ల మందికి నిత్యం సన్నబియ్యంతో ఈ రోజు భోజనం చేయగలుగుతున్నారు.

కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ జీవనాడులు. ఆ నదుల్లో మనకు హక్కుగా దక్కాల్సిన నీటి వాటాలపై రాజీ పడేది లేదు. ప్రతి చుక్క నీటిపై పక్కా హక్కులు సాధించే దిశగా కృష్ణా జలాల విషయంలో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన 904 టీఎంసీల వాటాను సాధించి తీరేలా వ్యూహరచన చేస్తున్నాం. ఆ దిశగా మొత్తం రాష్ట్రానికి మేం మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తున్నాం. రోడ్లు, విద్యుత్, రహదారులు, రవాణా సదుపాయాలు, మురుగు నీటి పారుదల, వాతావరణ స్వచ్ఛత ఇలా అన్నీ కోణాల్లో అత్యంత స్వచ్ఛమైన, సుఖమైన జీవన ప్రమాణాలతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను మార్చాలి. లక్షల కోట్ల అంతర్జాతీయ పెట్టుబడులకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, గాంధీ సరోవర్ ప్రాజెక్టు ఉండబోతున్నాయి. మూసీ పరివాహక ప్రాంతం నైట్ ఎకానమీ కొనసాగించేలా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ప్రపంచానికే ఆదర్శంగా నిలబడే మూసీ పునరుజ్జీంకోసం రూపొందించనున్న ప్రణాళికలను 2025 డిసెంబర్ 9 న ఆవిష్కరిస్తాం.

ఓఆర్ఆర్‌పై తలపెట్టిన గేట్ వే ఆఫ్ హైదరాబాద్ ఒక గొప్ప స్వాగత తోరణంగా నిలుస్తుంది. 24 వేల కోట్ల రూపాయల అంచనాతో మెట్రో రెండవ దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నాం. ఇప్పుడున్న 69 కిలోమీటర్ల మెట్రో మార్గానికి అదనంగా రెండో దశలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం జరుగుతుంది. రాష్ట్ర అభివృద్ధికి రాచమార్గంగా నిలబడనున్న 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు అనుగుణంగా రీజినల్ రింగ్ రైల్ కోసం కేంద్రం దాదాపుగా అంగీకరించింది. గ్రీన్ ఫీల్డ్ హైవే తో పాటు ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా చెన్నై బుల్లెట్ ట్రెయిన్ అడుగుతున్నాం. ఏ గ్రామమైనా, జిల్లా అయినా, రాష్ట్రం, దేశం ముందుకు వెళ్లాలంటే ప్రణాళికలు అవసరం. 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పం మాది. ఆ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047'. డిసెంబర్ 9 న రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తాం.

ఈ సంకల్ప పత్రాన్ని కార్యచరణలో పెట్టి 2047 నాటికి దేశ ప్రగతిలో తెలంగాణది కీలక పాత్రగా చేయడమే మా సంకల్పం. మా సంకల్పానికి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీస్సులు కావాలి. సాయుధ పోరాట స్ఫూర్తితో మొదలైన మన ప్రయాణం... ప్రపంచ వేదికపై తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి చేరాలి. ఆ బాధ్యత మాది. అందుకు ప్రజల సంపూర్ణ సహకారం కావాలి..'' అని అన్నారు. ఈ ప్రజా పాలన దినోత్సవ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, డీజీపీ జితేందర్ గారితో పాటు ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ తన వైఖరి స్పష్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నకిలీ విత్తనాలు రైతులకు కట్టబెట్టి రైతుల చావుకు కారణమైన దళారుల నుండి రైతులకు నష్టపరిహారం అందివ్వడం ములుగు జిల్లా కలెక్టర్ చేసిన తప్పు కేటీఆర్ సమక్షంలోనే పనిచేసే కలెక్టర్ ను అవమానించినట్టు మాట్లాడుతుంటే కేటీఆర్ స్పందించకపోవడం దురదృష్టం అని అన్నారు. నరసింహమూర్తి తన యావదాస్తి అమ్మి అయినా సరే బి ఆర్ ఎస్ గవర్నమెంట్ వస్తే కలెక్టర్ ను రాష్ట్రంలో లేకుండా చేస్తా అనడం సభవేనా అని మంత్రి సీతక్క అన్నారు.

ఈ సమావేశంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ గారు,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి గారు, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ గారు ,ములుగు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి గారు, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న గారు ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా గారు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 11.50 కోట్ల విలువైన భూమని కాపాడిన హైడ్రా

- వెయ్యి గజాల పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని మాధవా హిల్స్ ఫేజ్ 2లో పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం కాపాడిరది. వెయ్యి గజాల పార్కు స్థలంలో స్థానికంగా ఉన్న వాళ్లు గోడలు కట్టి.. షెడ్డులు వేశారంటూ హైడ్రా ప్రజావాణిలో మాధవా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను స్థానిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి... పార్కు స్థలంగా నిర్ధారించుకున్న హైడ్రా.. వెంటనే ఆక్రమణలను తొలగించింది. ఈ భూమి విలువ దాదాపు రూ.11.50 కోట్లు ఉంటుందని అంచనా. పార్కును కాపాడినట్టు పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.




## ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చారిత్రక వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అంశంపై కూడా మహేశ్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించినందువల్లే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. అయినప్పటికీ, బీసీల హక్కుల కోసం పోరాడే నాయకుడిగా మల్లన్నను తాను గౌరవిస్తానని అన్నారు. రాజకీయాల్లో ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తామని, మల్లన్న కొత్త పార్టీ నిర్ణయాన్ని కూడా ఆహ్వానిస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పార్టీ అంతర్గత వ్యవహారాలపైనా ఆయన స్పందించారు. కోమటిరెడ్డి సోదరులు తమ అభిప్రాయాలను బాహాటంగానే వెల్లడిస్తారని, కాంగ్రెస్ పార్టీలో ఆ మేరకు స్వేచ్ఛ ఉందని తెలిపారు. అయితే, ఆ స్వేచ్ఛను అలుసుగా తీసుకుని ఎవరైనా 'రెడ్ లైన్' దాటితే మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణను అతిక్రమించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పారు.



## రాష్ట్రంలో నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా నిలిపివేశాయి. ఈ హఠాత్పరిణామంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి రూ.1,400 కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉందని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. ఈ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బకాయిలు చెల్లించేంత వరకు సేవలను పునరుద్ధరించేది లేదని ఆసుపత్రుల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలను ఆయన కోరారు. తాము కల్పించిన స్వేచ్ఛను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “గత తొమ్మిదిన్నర ఏళ్లుగా సేవలు కొనసాగించిన ఆసుపత్రులు, ఇప్పుడే ఎందుకు నిలిపివేశాయో చెప్పాలి. గత



ప్రభుత్వ హయాంలో నెలకు రూ.50 కోట్లు కూడా విడుదల కాని పరిస్థితి ఉండేది'' అని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలకు రూ.100 కోట్లు చెల్లించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.



# శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి

**చిల్కానగర్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు) :** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ గుట్టపై ఉన్న బ్రహ్మంగారి గుడిలో మంగళవారం శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజా కార్యక్రమం, హోమం నిర్వహించగా అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా చిల్కానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంపెల్లి రవీందర్ ముదిరాజ్, జల్లి మోహన్, విశ్వకర్మ సంఘం కార్యవర్గ సభ్యులు, విశ్వకర్మ కుల పెద్దలు భారీగా పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ.విశ్వకర్మ మహర్షి మన సమాజానికి శిల్పకళ, వృత్తిపరమైన నైపుణ్యాలు అందించి దేశ అభివృద్ధికి మార్గదర్శకుడని పేర్కొన్నారు. ఆయన జయంతిని ప్రతి సంవత్సరం ఘనంగా జరపడం విశ్వకర్మ వంశస్థుల ఐక్యతకు, ఆధ్యాత్మికతకు ప్రతీక అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక యువత, మహిళలు కూడా పాల్గొని పూజల్లో భాగమయ్యారు. అన్నదానంలో వందలాది మంది భక్తులు పాల్గొని ఆశీర్వాదం పొందారు.





# ఘనంగా 76వ తెలంగాణ విమోచన దినోత్సవం

**కుషాయిగూడ, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో 76వ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఎగురవేసి, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు తెరదించుతూ, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన పటేల్ త్యాగస్ఫూర్తిని ఆయన స్మరించారు. మోడీ జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు: ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని, చర్లపల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు చల్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో, సేవాపక్షం 2025 కన్వీనర్ నాలాచెర్ల జనార్ధన్, కో కన్వీనర్లు నాగమణి, సంపత్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, అనంతరం జిహెచ్ఎంసి సఫాయి కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 75 మంది మోడీ అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, కార్పొరేటర్ అభ్యర్థులు కాసుల సురేందర్ గౌడ్, గణేష్ ముదిరాజ్, ఆర్. వెంకటేశ్వర్లు (వెంకులు), అలాగే ఆనంద్ గౌడ్, నాదం, హరినాయక్, లక్ష్మీనారాయణ, రమేష్ చౌదరి, బ్రహ్మచారి, దయానంద్, పిట్టల రాజు, గణేష్ గౌడ్, సహదేవ్ గౌడ్, రాంబాబు, అప్పి, బండారి అనిల్, వివేక్, శ్రీకాంత్, కళావతి, శంకర్ వంశరాజ్, రాజేష్ వంశరాజ్, రామకృష్ణ, ఆర్కే, యాదయ్య, సిహెచ్. లక్ష్మణ్, శ్రీశైలం, గొల్ల శ్రీను ముదిరాజ్, పిట్టల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# హైకోర్టు కాలనీ హెచ్ఎంటి నగర్ లింకు రోడ్డు పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే బండారి

### 17 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం ప్రారంభం

**చిల్కానగర్, నాచారం, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో హైకోర్టు కాలనీ నుండి హెచ్ఎంటి నగర్ వరకు కలిపే నూతన లింకు రోడ్డుకు శంకుస్థాపన ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డును రూ. 17 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు సౌకర్యం కలుగుతుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ -

“కాలనీల మధ్య లింకు రోడ్లు నిర్మించబడితే ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయి. హైకోర్టు కాలనీ నుండి హెచ్ఎంటి నగర్ వరకు పాడైపోయిన రోడ్డును అత్యంత త్వరగా పూర్తిచేసి, స్థానికుల వినియోగానికి అందుబాటులోకి తెస్తాం. అభివృద్ధి పనులలో ఎక్కడా రాజీపడమని ప్రజలకు హామీ ఇస్తున్నాం” అని అన్నారు.ప్రజల్లో హర్షం:ఈ కార్యక్రమం లో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ పాల్గొన్నారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ చిల్కానగర్, నాచారం డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేశారు.

# రాచకొండ కమిషనరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం

**అంబర్‌పేట, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అంబర్‌పేట కార్ హెడ్‌క్వార్టర్స్‌లో సిపి సుధీర్ బాబు ఐపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.



ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ నిజాం పాలనలో కొనసాగిందని, అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో జరిగిన ఆపరేషన్ పోలో విజయవంతమవడంతో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తు చేశారు. అందుకే ఈ రోజును తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.

ప్రజా పాలనలో పారదర్శకత ఉండడం ద్వారా ప్రజలకు లాభాలు చేకూరుతాయని, శాంతి భద్రత పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజా ఐపీఎస్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ ఎస్ఓటి రమణ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీలు మనోహర్, శ్రీనివాసులు, సైబర్ క్రైమ్స్ డీసీపీ నాగలక్ష్మి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ



ఉషా విశ్వనాథ్, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్యామ్ సుందర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.





# పెద్దమందడిలో ఘనంగా ప్రధాని మోడీ 75వ జన్మదిన వేడుకలు

**పెద్దమందడి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలను పెద్దమందడి మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సీనియర్ కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించగా, పార్టీ కార్యకర్తలు, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. అదేవిధంగా సామాజిక సేవలో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. పెద్దమందడి మండల కేంద్రంలో వందలాది మందికి అన్నప్రసాదం అందజేయడం జరిగింది.

ప్రధాని మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని 75 కిలోల భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ——

"ప్రధాని మోడీ దేశానికి అందించిన సేవలు, ఆయన నాయకత్వంలోని అభివృద్ధి ప్రస్థానం ప్రతి కార్యకర్తకు ప్రేరణ" అని పేర్కొన్నారు. అందరి కార్యకర్తల సహకారంతో ఈ వేడుకలు దిగ్విజయంగా ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి.

ఈ కార్యక్రమంలో అశ్విని రాధ, అశ్విని నందకుమార్, మాజీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్, పెద్దమందడి బాబు, మహేష్, రమేష్ శెట్టి, జి. శ్రీనివాస్ రెడ్డి, జి. సతీష్, రఘువీర్ రెడ్డి, ధర్మేంద్ర సాగర్, జి. నరేష్, అశ్విని శ్రీనివాసులు, రమేష్ గౌడ్, పల్లె రాములు, కె. రామకృష్ణ, ఎస్. రవికుమార్, అశ్విని గోవర్ధన్, అమ్మపల్లి శంకర్ గౌడ్, పెద్దమందడి ధర్మ, సుదర్శన్ రెడ్డి, రాము, జగత్ పల్లి కృష్ణ, మణిగిల్ల కృష్ణ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

### మేడ్చల్ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రత్యేక పూజలో

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు) :** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విరాట్ విశ్వ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దేవుడిని దర్శించుకున్నారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరయ్యారు. హోమంలో పాల్గొని విశ్వకర్మ స్వామి ఆశీర్వాదాలను పొందారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ :“దేశ నిర్మాణంలో విశ్వకర్మ కులస్తుల పాత్ర అత్యంత ప్రధానమైనది. శ్రమజీవులు, వృత్తిదారులు, కళాకారులు ఈ దేశ అభివృద్ధికి వెన్నెముకల వంటివారు. వారి కృషివల్లే మన సమాజం, మన దేశం ముందుకు వెళ్తోంది. విశ్వకర్మ జయంతి వంటి మహోత్సవాలు మన సంప్రదాయాలను కాపాడటమే కాకుండా, సామరస్యాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తున్నాయి” అన్నారు.అలాగే ఆయన “విశ్వ బ్రహ్మణ సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవి. వారి అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను” అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బోంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, జవహర్‌నగర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విశ్వకర్మ కుల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మహోత్సవం సందర్భంగా దేవాలయం పరిసరాలు పండుగ వాతావరణంలో కళకళలాడాయి. భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేయగా, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి.





# ఘనంగా 32వ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

**బాలనగర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** బాలానగర్, చరబండ రాజు కాలనీ శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో 32వ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం బుధవారం ఎంతో వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు సమాజంలో ఐక్యత, సాంప్రదాయం, భక్తి విలువలను చాటిచెప్పే వేడుకలని పేర్కొన్నారు. విశ్వకర్మను సృష్టికర్తగా, శిల్పకళలకు అధిపతిగా ఆరాధించే సంప్రదాయం ఎంతో ప్రాచీనమైందని, అలాంటి ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, శేఖర్ యాదవ్, స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసరాలు భక్తజనాలతో కిటకిటలాడాయి.మహోత్సవంలో హోమాలు, వేదపఠనాలు, అన్నదానాలు నిర్వహించగా భక్తులు విశేషంగా స్పందించారు.






# బిఆర్ఎస్ నేతల నీతి పాఠాలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది

**బిఆర్ఎస్ పై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

**హనుమకొండ,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు పాల్గొని బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిపక్ష బాధ్యతలు నిర్వర్తించే పెద్దమనిషి బీఆర్ఎస్‌లో కనిపించడం లేదని, అభివృద్ధి గురించి మాట్లాడని వారు ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నాలు మాత్రమే చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ నిలకడగా ఉన్నాయని, ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాళేశ్వరం అవినీతి పై బీఆర్ఎస్ నేతలు ఇప్పటికీ సమాధానం ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, అధికారాన్ని కోల్పోయాక బీఆర్ఎస్ నేతలు సత్యహరిచంద్రుల్లా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు. ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్యం నడవదని, దానిని అడ్డుకున్న ఘనత కేసీఆర్‌దేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేదంటున్న బీఆర్ఎస్ నేతలు దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాలు విసిరారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ విద్యార్థుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు నీతులు చెబుతుండడం హాస్యాస్పదమని మండిపడ్డారు. సొంత పార్టీలోనే ఐక్యత లేని వారు ప్రభుత్వంపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించడం లాంటిదని వ్యాఖ్యానించారు. కవిత అడిగిన ప్రశ్నకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని, పల్ల రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజలు ఇంకా మరిచిపోలేదని గుర్తుచేశారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్‌తో పాటు పలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి అండగా సీఎం సహాయనిధి

## లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.

ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలకు సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద 1,152 చెక్కులు రూ.48,92,000 విలువ గలవి లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు.



ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన అన్నారు: "గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క క్రమశిక్షణతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు. పేదలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు".

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ కేటాయించిందని తెలిపారు. "ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతుంది. ఆరోగ్యశ్రీ లేనివారికి చికిత్స అనంతరం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నాం" అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్యానికి కొండంత ఆసరాగా నిలుస్తుంది. పేద ప్రజలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి కృషి చేస్తుంది అని అన్నారు.

చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


# ఘనంగా విశ్వకర్మ జయంతి మహా యజ్ఞ మహోత్సవం

**కాప్రా, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని కాప్రా సర్కిల్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో, మీర్పేట్ హెచ్‌బి కాలనీ 1వ ఫేజ్ ప్లే గ్రౌండ్‌లో మహా యజ్ఞ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే విశ్వకర్మ దేవుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు, హోమాలు, హవనాలు జరిగాయి. మంత్రోచ్చారణలతో వాతావరణం మార్మోగిపోగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి దంపతులను బిసి సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, కుందానం గణేష్ చారి, లక్ష్మీనారాయణ చారి, మల్లికార్జున చారి, శ్రీనివాస్ చారి, మురళి చారి తదితర విశ్వకర్మ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశ్వకర్మ దేవుడు సృష్టి కారుడు, కార్మిక లోకానికి మార్గదర్శకుడు అని, ఆయన ఆశీర్వాదాలతోనే కర్మలో విజయం సాధ్యమని పిలుపునిచ్చారు.సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విశ్వకర్మ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ఇకపై మరింత వైభవంగా మహోత్సవాలను చేపడతామని తెలిపారు. ఈ మహోత్సవంలో విశ్వకర్మ సంఘ సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యజ్ఞ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.



# సమాజానికి మార్గదర్శకుడైన విప్లవ యోధుడు పెరియార్

ప్రపంచ చరిత్రలో ప్రతి యుగానికి ఒక విప్లవయోధుడు అవసరం అవుతాడు. న్యాయం కోసం, సమానత్వం కోసం, ప్రజల స్వాభిమానం కోసం పోరాడే యోధుడు. అలాంటి మహనీయుడు దక్షిణ భారతదేశానికి దొరికిన వరం పెరియార్ ఈ.వి. రామస్వామి నాయికర్.ఆయన కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, ఒక విప్లవ జ్యోతి. సమాజంలో మూఢనమ్మకాలు, కులవివక్ష, స్త్రీపురుష అసమానత్వం వంటి సమస్యలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తోంది.




**పెరియార్ జీవితం...ఒక స్ఫూర్తి!**

1879లో తమిళనాడులో జన్మించిన పెరియార్ చిన్న వయస్సులోనే కులవివక్ష, సామాజిక అన్యాయం, మూఢనమ్మకాల చేదు అనుభవాలు ఎదుర్కొన్నారు. కానీ మౌనం ఆయన స్వభావం కాదు.

"ఎందుకు మనుషుల మధ్య తేడాలు?"

"ఎందుకు స్త్రీకి హక్కులు లేవు?"

"ఎందుకు దేవుడి పేరుతో మోసం చేస్తున్నారు?"అని ప్రశ్నలు వేస్తూ సమాజంలో విప్లవాత్మక ఆలోచనలకు నాంది పలికారు.

**స్వాభిమాన ఉద్యమం,కొత్త దిశ**

1925లో పెరియార్ ప్రారంభించిన స్వాభిమాన ఉద్యమం సమాజంలో కొత్త దారిని చూపించింది. కులం, మతం అనే గోడలు కూలగొట్టాలని పిలుపునిచ్చారు. స్త్రీ,పురుష సమానత్వం కోసం నినదించారు. శాస్త్రీయ దృక్పథం, ఆలోచనా స్వేచ్ఛ, వివేకాన్ని ప్రోత్సహించారు. ఈ ఉద్యమం ప్రజల్లో కొత్త చైతన్యాన్ని నింపింది.

**స్త్రీ విముక్తి,సమాజానికి సమానత్వం**

పెరియార్ కాలంలో స్త్రీని కేవలం ఇంటికే పరిమితం చేశారు. కానీ ఆయన ధైర్యంగా స్త్రీ హక్కుల కోసం గళమెత్తారు.
- అమ్మాయిలకు చదువుకునే హక్కు ఉందని
- ఆస్తిలో సమాన హక్కు ఉందని
- వివాహం, విడాకుల విషయంలో స్త్రీకి స్వేచ్ఛ అవసరమని స్పష్టంగా ప్రకటించారు.

నేడు మనం చూసే మహిళా సాధికారతకు ఆయన వేసిన పునాది ఎంతో గొప్పది.

**వివేకం,మూఢనమ్మకాలపై తిరుగుబాటు**

"ప్రశ్నించు... ఆలోచించు... నిజాన్ని వెతుకు!" అనే ఒక్క మాటతోనే పెరియార్ తన దృక్పథాన్ని సమాజానికి బోధించారు. దేవుడి పేరుతో జరుగుతున్న అన్యాయాలను బహిర్గతం చేసి, శాస్త్రం, జ్ఞానం, వివేకం మాత్రమే మనిషిని ముందుకు నడిపిస్తాయని నమ్మారు.

**పెరియార్ పాఠాలు,నేటికీ మార్గదర్శకాలు**
- అన్యాయం చూసి మౌనం వహించకూడదు.
- కులం, మతం ఆధారంగా కాకుండా కృషి, గుణం ఆధారంగా మనిషిని చూడాలి.
- విద్యను ఆయుధంగా మార్చుకోవాలి.
- స్త్రీ-పురుషులకు సమాన హక్కులు కల్పించాలి.
- ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలి.

పెరియార్ ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక ప్రజాజాగృతి. ఆయన జీవితం మనందరికీ చెబుతున్న సందేశం స్పష్టంగా ఉంది – "భయపడకు, ధైర్యంగా నిలబడు. ప్రశ్నించు, ఆలోచించు, సమానత్వం కోసం పోరాడు."విద్యార్థులు, యువతరం ఈ పాఠాన్ని గుండెల్లో దాచుకుని ముందుకు సాగితే, మన సమాజం వెలుగుతో నిండుతుంది.

**– హన్మకొండ శ్రీకాంత్, జర్నలిస్ట్**



# ఘనంగా ప్రధాని మోడీ 75వ జన్మదిన వేడుకలు ఉస్మానియా యూనివర్సిటీలో

**తార్నాక , సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల ముందు విద్యార్థి నాయకులు జాడీ రమేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ హాజరై విద్యార్థులతో కలిసి జన్మదిన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. విద్యార్థులు "లాంగ్ లివ్ నరేంద్ర మోడీ జీ" అంటూ నినాదాలతో కార్యక్రమాన్ని సందడిగా మార్చారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు జాడీ రమేష్ మాట్లాడుతూ :వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ రాత్రింబగళ్లు కృషి చేస్తున్నారని.జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపుతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు గణనీయమైన మేలు జరుగుతోందని. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కొనసాగిస్తున్నారని తెలిపారు.అలాగే దేశ ప్రధానిగా రికార్డు సృష్టించడమే కాకుండా అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టను పెంపొందించడంలో నరేంద్ర మోడీ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన గ్లోబల్ లీడర్‌గా పేరు సంపాదించడం భారతీయులందరికీ గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వినోద్ నునావత్, చరణ్, సుధాకర్, ఇక్షిత్, అనిత ముదిరాజ్, డా. కతరసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హీ సేవా ప్రజా పాలన దినోత్సవం ప్రత్యేక కార్యక్రమాలు

**నాగారం, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మరియు రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంను పురస్కరించుకొని, నాగారం పురపాలక సంఘంలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక వేడుకలకు పురపాలక సంఘం కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యం నిర్వహించారు. మొదట కమిషనర్ జెండా ఆవిష్కరణ చేసి, అనంతరం పురపాలక సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, యువతతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధులలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.అలాగే రోడ్లు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. చెత్త తొలగింపు, శుభ్రత చర్యలు విస్తృతంగా జరిగాయి. పట్టణం మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా మారేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ సంతోష్ కుమార్, మేనేజర్ సురేష్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వర రావు, టౌన్ ప్లానింగ్ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బి. శ్రవణ్ కుమార్ తో పాటు పురపాలక సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




కమిషనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ : "పరిశుభ్రత మన బాధ్యత మాత్రమే కాదు, మన సంస్కృతిలో కూడా ఒక భాగం. ప్రతి పౌరుడు పరిశుభ్రతకు కట్టుబడి ఉంటేనే ఆరోగ్యం, అభివృద్ధి సాధ్యమవుతుంది. నాగారం పట్టణం పరిశుభ్రమైన మున్సిపాలిటీగా నిలవడం అందరి సహకారంతోనే సాధ్యమవుతుంది" అని తెలిపారు.


# హెచ్.యం.టి. నగర్‌లో ప్రతిరోజూ జాతీయ గీతాలాపన

**నాచారం, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** దేశభక్తి, జాతీయ సమైక్యత భావాల పెంపొందనకు ప్రతిరోజూ జాతీయ గీతాన్ని ఆలపించడం ఎంతో ప్రాముఖ్యమైందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.నాచారం డివిజన్ పరిధిలోని హెచ్.యం.టి. నగర్ హెచ్.యం.డి.ఏ పార్క్‌లో హెచ్.యం.టి. నగర్ ఫ్రెండ్స్ టీమ్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 7.45 గంటలకు జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. జాతీయ గీతాలాపన ఒక క్రమశిక్షణ, దేశభక్తి, ఐక్యతకు ప్రతీక అని, చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని అన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ: స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం మనకు లభించిందంటే అది త్యాగాల ఫలితమని, ప్రతిరోజూ జాతీయ గీతాన్ని పాడడం ద్వారా ఆ త్యాగాలను గుర్తుచేసుకోవడం సమాజంలో అవగాహన పెంచుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు సుమన్, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, గీత ప్రవీణ్ ముదిరాజ్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఎం.బి.సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడురి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, హెచ్.యం.టి. నగర్ వాసులు భారీగా హాజరయ్యారు. పిల్లలు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో ఈ పార్క్ దేశభక్తి నినాదాలతో మారుమ్రోగింది. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజూ కొనసాగించేందుకు సంకల్పించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అంబేద్కర్ కళాభవనానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం

**కొత్తకోట,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు తమ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 370, 371లో ఉన్న ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ కళాభవనానికి స్థలం కేటాయించాలని బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్లలో ఇప్పటికే శ్రీకృష్ణ దేవాలయం, మదర్ థెరిస్సా కమిటీ హాల్, 10 మంది జర్నలిస్టులకు, ఉద్యమకారుడు మహేష్‌కు, వాల్మీకి దేవాలయానికి స్థలాలు కేటాయించారని. మిగిలిన భూమిలో అంబేద్కర్ కళాభవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అలాగే మా గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని గ్రామ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలనీ, ఆ గ్రామానికి సంబంధం లేని వారికి స్థలాలను కేటాయించకూడదని డిమాండ్ చేశారు. "భవిష్యత్తులో గ్రామానికి అవసరమైన స్థలం లేకుండా పోకుండా ప్రస్తుత ప్రభుత్వ భూమిని భద్రపరచాలి" అని గ్రామస్థులు తహసీల్దార్‌కు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో నాగన్న, ప్రభుదాస్, పెద్ద కుర్మయ్య, బోజ్జన్న, ధనుష్, డీకే లక్ష్మణ్, జంగిడి రాజు, దామోదర్, రవి తదితరులు పాల్గొన్నారు.




# అక్రమసంబంధం కోసమే సుఫారీ పేరుతో జైలుకు...?

**విలేకరుల సమావేశంలో న్యాయం చేయాలని వేడుకున్న మాజీ సర్పంచ్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 17, తెలంగాణ ముచ్చట్లు;** వివాహేతర సంబంధం కోసమే అడ్డు తొలగించుకునేందుకు సుఫారీ సృష్టించి అక్రమ కేసు పెట్టించి జైలుకు పంపారని ముదిగొండ మండలం సువర్ణపురానికి చెందిన తోట మౌనిక ఆరోపించింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తోట మౌనిక తన తండ్రితో కలిసి మాట్లాడుతూ.. ముదిగొండ మండలం సువర్ణ పురం గ్రామానికి చెందిన తోట ధర్మారావుతో 15 సంవత్సరముల క్రితం వివాహం జరిగి ఇద్దరు కుమారులని తెలిపింది. మొదటి నుండి తన భర్త అనుమానం వ్యక్తం చేసేవాడని ఎవరితో మాట్లాడిన అక్రమ సంబంధం అంతకట్టేవాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటి చుట్టూ కూడా సీసీ కెమెరాలను ఏర్పాటుచేశాడని పేర్కొంది. అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడని తెలిపింది. తనను అడ్డు తొలగించుకునేందుకు వేరే వ్యక్తితో అక్రమ సంబంధం సృష్టించి సుపారి మర్డర్ ప్లాన్ చేసుకొని, ఇటు మా తల్లిగారి ఊరు, అటు అత్తగారు ఊరు కాకుండా ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్లో ఎంక్వైరీ పేరుతో పిలిపించి తనకు తెలియకుండానే జైలుకు పంపారని ఆరోపించింది. జైలు నుండి వచ్చిన తర్వాత ఇంటికి, తన ఫోనుకు ఉన్న సీసీటీవీ అనుసంధానం వలన వారి అక్రమ సంబంధం బయటపడిందని తెలిపింది. ఇట్టి విషయమై ముదిగొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని తెలిపింది తనతో వివాహం జరిగి వేరే మహిళలతో అక్రమ సంబంధం, తన పెద్ద కుమారుడిని చూడనీయకుండా వేదనకు గురి చేస్తున్నాడని ఆరోపించింది. తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకుంది.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ**

**వనపర్తి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, "1948 సెప్టెంబర్ 17న నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యం అంటే మన తెలంగాణ భారత సమాఖ్యలో విలీనమైంది. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఈ రోజును ప్రజాపాలన దినోత్సవంగా ఘనంగా నిర్వహిస్తున్నాము" అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరికీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, గ్రంథాలయం చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, వనపర్తి పట్టణ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా విభాగాలు, సోషల్ మీడియా, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, వక్ఫ్ బోర్డ్ సభ్యులు, ఐఎన్‌టియూసీ, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుంది

**ఎంపీ కడియం కావ్య**

**హన్మకొండ,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ పట్టణంలోని లష్కర్ సింగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆనందంగా, సుఖశాంతులతో జీవిస్తుందని పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణలో భాగంగా గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు, ఫిజీషియన్లు, ఈఎన్టీ, దంత నిపుణులు సహా అనేక మంది వైద్యులు సేవలందిస్తున్నారని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వైద్య సిబ్బంది ఇచ్చే సూచనలను పాటించాలని ఆమె పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలితో రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవడం అవసరమని ఆమె ప్రత్యేకంగా సూచించారు.

ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం, ఎంపీ కడియం కావ్య హనుమకొండలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో కలిసి శిబిరానికి వచ్చిన మహిళలను పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఫాలోఅప్ సేవలు అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే టీబీ బాధితులకు దాతలు అందించిన పోషకాహార కిట్లను పంపిణీ చేశారు.

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తమ పరిధిలోని మహిళలకు శిబిరాల సమాచారం అందించి, వారిని తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని చెప్పారు. పోషణ మాసంలో భాగంగా మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 120 ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిహెచ్సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, టీచింగ్ ఆసుపత్రులు, వైద్యవిధాన పరిషత్, ఐఎంఏ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల వైద్యులు కలిసి సేవలందిస్తున్నారని వివరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్మోహనరావు, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ విజయకుమార్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ అజిత్ మహమ్మద్, డాక్టర్ సుదీప్, గైనకాలజిస్టులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ హారిక, ఇతర వైద్యులు, అధికారులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.






# ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బోయినపల్లిలో వీల్‌చైర్స్ పంపిణీ

**కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్**

**బోయినపల్లి, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని, బోయినపల్లిలో వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ. మెంటల్‌గా డిసేబుల్ పిల్లలకు ఇంకా మెరుగైన సదుపాయాలు అవసరమని అన్నారు.ఈ సమస్యలపై మరిన్ని రీసెర్చ్ జరగాలని సూచించారు.ఈ కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఎర్లీ డిటెక్షన్ ద్వారా చాలా సమస్యలు పరిష్కరించవచ్చని పేర్కొన్నారు.అలాగే దివ్యాంగుల గౌరవప్రదమైన జీవితానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. "జీనోం యుగంలో శాశ్వత పరిష్కారాలు కనుగొని, మెంటల్ డిజేబిలిటీ రాకుండా చూసుకోవాలి" అని అన్నారు. మోదీపై ప్రశంసలు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "మోదీ 12వ సంవత్సరంలో ప్రధానమంత్రిగా అడుగుపెట్టారు. 75 ఏళ్ల వయసులో కూడా 25 ఏళ్ల యువకుడిలా ఆలోచిస్తూ, 365 రోజులు నిరంతరం పని చేస్తున్నారు. ఆయనకు జ్వరం వచ్చినా, మోకాళ్ల నొప్పులు వచ్చినా ఒక్కరోజు కూడా విశ్రాంతి తీసుకోరు" అని కొనియాడారు.మోదీ పాలనలో మార్పులు జన్‌ధన్ ఖాతాల ద్వారా పేదలకు ఆర్థిక సహకారం అందిందని, చిన్న వ్యాపారులు, పళ్ళు అమ్మే వారు కూడా డిజిటల్ పేమెంట్ వినియోగిస్తున్నారని తెలిపారు. "ఇంతవరకు బిచ్చగాళ్లు కూడా స్కానర్ కోడ్ పెట్టుకోవడం మోదీ పాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పు" అని అన్నారు.కార్యక్రమం ప్రాముఖ్యత ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. "ఇలాంటివి మరింత మంది ముందుకు వచ్చి చేయాలి. సేవ చేసేవారు పెరిగితే సమాజం బాగుపడుతుంది" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేజర్ రాజ్‌కుమార్, డిజిఎం సంజయ్ సింగ్, కొల్లి నాగేశ్వరరావు, నర్మదా మల్లికార్జున, దీపికా, శేఖర్ యాదవ్, మాణిక్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పిట్ల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.





# పెద్దమందడిలో బిజెపి ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం

**ప్రధాని మోడీ 75వ జన్మదిన వేడుకలు**

**పెద్దమందడి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల బిజెపి కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండలాధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించారు.తదనంతరం భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముప్పూరి చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోడీ పుట్టినరోజు పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "మోడీ దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆయన పుట్టినరోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య, శివారెడ్డి, తిరుపతయ్యతో పాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## తాటికాయలలో ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు


**ధర్మసాగర్,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో బిజెపి గ్రామ శాఖా అధ్యక్షులు పెసరు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేకు కోసి,పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ.... దేశ ప్రగతి కోసం మోడీ చేస్తున్న కృషి విశేషమని, ఆయన జన్మదినాన్ని ప్రజా సేవా దినోత్సవంగా గుర్తించుకోవాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో కోట్లాది ప్రజలు లబ్ధి పొందుతున్నారని, గ్రామాల అభివృద్ధి కోసం బీజేపీ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ప్రేరణగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.నాయకులు, కార్యకర్తలు ప్రధాని దీర్ఘాయుష్షు కోసం ఆకాంక్షిస్తూ, అభివృద్ధి మార్గంలో దేశం ముందుకు నడిపించాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ననుబాల కుమార్ స్వామి, యూత్ అధ్యక్షులు దువ్వల అఖిల్, బూత్ అధ్యక్షులు కొండబోయిన మహేష్, పిట్టల హరీష్, చింతగింది వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బొల్లెపాక వెంకటస్వామి, సల్ల శివకృష్ణ, వల్లాల అనిల్, ననుబాల సర్వేశ్వర్, దువ్వల బిక్షపతి, చొక్కం రాజు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ




**కాప్రా, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ సుచరిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, అనంతరం జరిగిన సభలో విఠల్ నాయక్ మాట్లాడుతూ "ప్రజాపాలన దినోత్సవం తెలంగాణ చరిత్రలో ఒక మహత్తర ఘట్టాన్ని గుర్తు చేస్తుంది. నిజాం రాజ్యంలోని నిరంకుశ పాలన, రజాకారుల అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పోలో ఫలితంగా తెలంగాణ ప్రజలు స్వేచ్ఛను పొందారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన రోజు," అని అన్నారు.అలాగే ఆయన రాష్ట్ర ప్రజలందరికీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, " మనమంతా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలి. రైతులు, కూలీలు, సాధారణ ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వాలు పనిచేయాలని" కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

## అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీని దాటి
# విలువైన కంపెనీగా ఎటర్నల్




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ కీలక మైలురాయిని చేరుకుంది. మంగళవారం నాటి ర్యాలీ తర్వాత ఎటర్నల్ మార్కెట్ విలువ దాదాపు రూ.3.16 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది దిగ్గజ అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా మోటార్స్ లాంటి కంపెనీలను అధిగమించింది. మంగళవారం సాయంత్రం మార్కెట్లు ముగిసే సమయానికి జొమాటో షేర్ ధర 1.19 శాతం పెరిగి రూ. 327.15 వద్ద ఉంది. గత నెలలో ఎటర్నల్ షేరు ధర 2.75 శాతానికి పైగా, గత మూడు నెలల్లో 31 శాతానికి పైగా పెరిగింది. ఈ నెల ప్రారంభంలో దేశీయ బ్రోకరేజ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా స్టాక్‌పై బుల్లిష్‌గా ఉన్నట్టు ప్రకటించింది. రానున్న రోజుల్లో షేర్ ధర రూ. 420కి పెరగవచ్చని విశ్లేషించింది. ఇటీవల జొమాటో ఆదాయం వేగంగా పెరుగుతుండటం, క్విక్‌కామర్స్ విభాగం బ్లింక్ఇట్ నుంచి పెరుగుతున్న రెవెన్యూ ద్వారా ఎటర్నల్ కంపెనీపై ఇన్వెస్టర్లకు విశ్వాసం పెరుగుతోంది. తాజా రూ. 3 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఎటర్నల్ నిఫ్టీ50లో టాప్25 జాబితాలో స్థానం దక్కించుకుంది. కంపెనీ మార్కెట్ క్యాప్ అదానీ పోర్ట్స్(రూ. 3.03 లక్షల కోట్లు), ఓఎన్‌జీసీ(రూ. 2.96 లక్షల కోట్లు), భారత్ ఎలక్ట్రానిక్స్(రూ. 2.94 లక్షల కోట్లు), అదానీ ఎంటర్‌ప్రైజెస్(రూ. 2.77 లక్షల కోట్లు), విప్రో(రూ. 2.66 లక్షల కోట్లు), టాటా మోటార్స్(రూ. 2.63 లక్షల కోట్లు), కోల్ ఇండియా (రూ. 2.44 లక్షల కోట్లు) కంటే ఎక్కువగా ఉంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా దేశీయ అతిపెద్ద కంపెనీలలో కొన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ. 19.01 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ. 14.84 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ. 11.06 లక్షల కోట్లు) ఉన్నాయి.

## భారీగా పెరిగిన బంగారు రుణాలు



సాధారణంగా చిన్న మొత్తం రుణాలపై ఆధారపడే తక్కువ ఆదాయ రుణగ్రహీతలు తక్షణ అవసరాల కోసం బంగారు రుణాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గణాంకాలు చెబుతున్నాయి. పెరుగుతున్న బంగారం ధరలు, ఇతర అన్‌సెక్యూర్డ్ క్రెడిట్‌తో పోలిస్తే బంగారు రుణాలపై తక్కువ వడ్డీ రేట్లు, కొత్త రుణాలను మంజూరు చేయడంలో మైక్రోఫైనాన్స్ సంస్థలు(ఎంఎఫ్ఐ) ఎక్కువ తనిఖీ వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం, ఈ ఏడాది జూన్ నాటికి బంగారంపై రుణాలు 122 శాతం పెరిగాయి. అయితే మైక్రోఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ నుంచి వచ్చిన డేటా అదే సమయంలో మైక్రోఫైనాన్స్ రుణాలు 16.5 శాతం తగ్గాయని చూపుతోంది. మైక్రోఫైనాన్స్ సంస్థల విషయంలో అమలవుతున్న కఠినమైన నిబంధనలు, అన్‌సెక్యూర్డ్ చిన్న రుణాల లభ్యత తగ్గడం వల్ల కూడా ప్రజలు బంగారం తాకట్టు పెట్టేందుకే చూస్తున్నారు. ముఖ్యంగా నెలవారీ ఆదాయం లేని, తక్కువ డాక్యుమెంటేషన్ ఉన్న గ్రామీణ ప్రాంతాలు, అసంఘటిత రంగాలలో ఉన్న వారి నుంచి బంగారు రుణాలకు అధిగ డిమాండ్ ఉంది. ఆర్‌బీఐ డేటా ప్రకారం, 2025, జూలై నాటికి బంగారు ఆభరణాలపై ఉన్న రుణాల విలువ రూ. 2.94 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇదే సమయానికి అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డ్ రుణాలు కేవలం 6 శాతం పెరిగి రూ. 2.91 లక్షల కోట్లకు చేరాయి. వ్యక్తిగత రుణాలు 8 శాతం పెరిగి రూ. 15.36 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఎంఎఫ్ఐల నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు రూ. 1.34 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక, కొన్ని నెలలుగా ఊహించని స్థాయిలో రికార్డు వేగంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. 2025లో ఇప్పటివరకు బంగారం ధరలు 44.14 శాతం పెరిగాయి, ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి రూ. 1,13,800 వద్ద ఉంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ. 800 పెరిగి రూ. 1,02,600కి చేరింది.

# 60 కోట్లు దాటిన ఓటీటీ యూజర్లు



దేశంలో ఓటీటీ యూజర్ల సంఖ్య అత్యంత వేగంగా పెరుగుతోంది. తాజాగా మీడియా కన్సల్టింగ్ సంస్థ ఆర్మ్యాక్స్ ఓటీటీ ఆడియన్స్ రిపోర్ట్2025 ప్రకారం, దేశంలో ఓవర్‌దిటాప్(ఓటీటీ) వీడియో ప్రేక్షకుల సంఖ్య 60.12 కోట్లకు పెరిగింది.ఇది దేశ జనాభాలో 41.1 శాతానికి సమానం. గతేడాది కంటే 10 శాతం అధికం. అంతే కాకుండా 14.82 కోట్ల మంది వినియోగదారులు యాక్టివ్ పెయిడ్ సబ్‌స్క్రిప్షన్‌లను కొనసాగిస్తున్నారు. టీవీలలో ఓటీటీలను వాడుతున్న వారి సంఖ్య 12.92 కోట్ల మంది ఉండగా, గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 87 శాతం పెరిగింది. ముఖ్యంగా ఈ ఏడాది టీవీలలో ఓటీటీలకు కనెక్ట్ అయిన వారి సంఖ్య అత్యంత వేగంగా పెరిగింది. గతంలో మొబైల్‌లలో ఎక్కువమంది ఓటీటీ యాప్‌లను ఉపయోగించేవారు. ఆ ధోరణి ఇప్పుడు టీవీలలోనూ పెరిగింది. కొత్తగా లాంచ్ అవుతున్న టీవీలలో కస్టమర్లను ఆకట్టుకునేందుకు దాదాపు అన్ని కంపెనీలు ఇన్‌బిల్ట్ ఓటీటీ యాప్‌లతో విడుదల చేస్తున్నాయి. ఇదే సమయంలో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ వినియోగం కూడా పెరుగుతోంది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ కంటెంట్ చూసే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ కారణంగానే దేశంలో అత్యంత వేగంగా ఓటీటీల వినియోగం పెరుగుతోందని ఆర్మ్యాక్స్ మీడియా ఫౌండర్, సీఈఓ శైలేష్ కపూర్ పేర్కొన్నారు.

# వాహన ఉత్పత్తిలో తగ్గుదల



వాహనాల ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది ఆగస్టులో నెలలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తిలో 4.1 శాతం తగ్గుదల చోటు చేసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడిరచాయి. మరోవైపు తయారీదారులు డీలర్లకు పంపిన డెలివరీలు దాదాపు 9 శాతం తగ్గాయి. వాహనాలపై జిఎస్‌టిని తగ్గించనున్నామని కేంద్రం ప్రకటించిన తర్వాత ఒక్కసారిగా అమ్మకాలు తగ్గాయి. ధరల తగ్గింపు ఆశతో వినియోగదారులు కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారని.. దీంతో అనేక డీలర్‌షిప్‌లలో రిటైల్ అమ్మకాలు దెబ్బతిన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో ఆగస్టు చివరి నాటికి కార్ల ఇన్వెంటరీ నిల్వలు 60 రోజులకు చేరుకున్నాయి. మొత్తం ఛానల్ ఇన్వెంటరీ దాదాపు 6,00,000 యూనిట్లకు చేరింది. దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి డెలివరీలు 8 శాతం తగ్గాయి. ఎంఅండ్ఎం 9 శాతం కంటే ఎక్కువ, హ్యుందాయ్ మోటార్ ఇండియా డిస్పాచ్‌లు సుమారు 10 శాతం తగ్గాయి.'గడిచిన ఆగస్టులో ప్యాసింజర్ వెహికల్ అమ్మకాలు గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 8.8 శాతం తగ్గి 3,22,000 యూనిట్లకు చేరాయి. మొత్తం ప్రయాణికుల వాహనాల ఉత్పత్తి 4 శాతం తగ్గి 1,25,000 యూనిట్లకు పరిమితమయ్యాయి.'' అని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ పేర్కొన్నారు. ద్వి, త్రిచక్ర వాహన అమ్మకాలు 7.1 శాతం పెరిగి 18.3 లక్షల యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. స్కూటర్ అమ్మకాలు 12.7 శాతం, మోటార్‌సైకిళ్లు 4.3 శాతం చొప్పున పెరిగాయి. సియామ్ గణాంకాల ప్రకారం.. ఆథర్ డిస్పాచ్‌లు దాదాపు 70 శాతం పెరిగి 22,757 యూనిట్లకు చేరాయి. హీరో మోటో కార్ప్ 5.4 శాతం వృద్ధిని నమోదు చేయగా.. రాయల్ ఎన్‌ఫీల్డ్ డిస్పాచ్‌లు 56 శాతం పెరిగాయి. గడిచిన ఆగస్టులో మూడు చక్రాల వాహనాల అమ్మకాలు 8.3 శాతం పెరిగి 76,000 యూనిట్లకు చేరాయి.

## జీఎస్టీ తగ్గింపును వినియోగదారులకు బదలాయిస్తాం




ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డెయిరీ వినియోగదారులను గుడ్‌న్యూస్ ప్రకటించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను తమ పాల, ఆహార ఉత్పత్తులకు అమలు చేశామని, తగ్గిన పన్నుల మేరకు ధరలను సవరించినట్టు మంగళవారం ప్రకటనలో వెల్లడిరచింది. ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపును వినియోగదారులకు పూర్తిస్థాయిలో బదలాయిస్తాం. పండుగ సీజన్‌లో చౌకగా తమ ఉత్పత్తులు అందరికీ అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. తగ్గించిన ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ తెలిపింది. జీఎస్టీ రేట్ల మార్పు కారణంగా తమ పాలు, వివిధ రకాల ఉత్పత్తులు ఇప్పుడు జీరో ట్యాక్స్ లేదా 5 శాతం పరిధిలోకి వస్తాయి.పనీర్, వెన్న, జున్ను, నెయ్యి, మిల్క్‌షేక్‌లు, ఐస్ క్రీమ్ లాంటి రోజువారీ ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గాయి. ఉదాహరణకు, 500 గ్రాముల వెన్న ప్యాక్ ఇప్పుడు రూ. 305కి బదులుగా రూ. 285కి లభిస్తుంది. బటర్‌స్కాచ్ కోన్ ఐస్‌క్రీమ్ రూ. 35 నుంచి రూ. 30కి తగ్గుతుందని మదర్ డెయిరీ వివరించింది. రోజువారీ పాల ప్యాకెట్ల ధరలు కూడా తగ్గుతాయని మదర్ డెయిరీ తెలిపింది. ఒక లీటరు టోన్డ్ టెట్రా ప్యాక్ పాల ధర రూ.77 నుంచి రూ. 75కి తగ్గుతాయి. మిగిలిన వాటిపై కూడా జీఎస్టీ ప్రయోజనాలు అందిస్తామని మదర్ డైరీ పేర్కొంది.

## మరో రెండు సార్లు వడ్డీ కోత..!

పండుగ సీజన్‌లో మరో రెండు సార్లు వడ్డీ రేట్లలో కోతలు ఉండొచ్చని అంతర్జాతీయ ఏజెన్సీలు అంచనా వేస్తోన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వచ్చే అక్టోబర్, డిసెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. రెండు దఫాల్లో మొత్తంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టొచ్చని విశ్లేషించింది. ఒక వేళ అదే జరిగితే రుణాలు చౌకగా మారనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 4 శాతం కంటే దిగువన నమోదు కావొచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం కట్టడిలోనే ఉన్నందున రానున్న రెండు సమీక్షల్లో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని విశ్లేషించింది. మరోవైపు జిఎస్‌టి శ్లాబుల తగ్గింపునతోనూ ధరలు మరింత దిగిరావొచ్చని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. గడిచిన ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో రెపోరేటును 0.25శాతం చొప్పున ఆర్‌బిఐ తగ్గించింది. జూన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. అలా మూడు వరుస సమీక్షల్లో కలిపి రెపోరేటు 1 శాతం తగ్గింది. ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టులో మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచింది. మోర్గాన్ స్టాన్లీ అంచనా ప్రకారం రెండు విడతల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గితే.. రెపో రేటు 5 శాతానికి తగ్గనుంది.

# ఆయన కలలను నిజం చేయడానికే ప్రధాని మోదీ కృషి : రాజ్‌నాథ్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సెప్టెంబర్ 17ను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా నిర్వహించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్?నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పరేడ్ మైదానంలోని అమర జవాన్ల స్మృతి స్థల్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సర్దార్ వల్లభాయ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. భద్రతా బలగాల గౌరవవందనం స్వీకరించారు. నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారన్న రాజ్‌నాథ్‌సింగ్ వారి ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు. పటేల్ సమర్థత వల్లే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసిందని తెలిపారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ పటేల్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించారన్న రాజ్‌నాథ్, పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిజాం మెడలు వంచి స్వాతంత్ర్యాన్ని సిద్ధించారు : ప్రధాని మోదీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందన్న మరో కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వారిని కేంద్రం గుర్తించి గౌరవిస్తుందని పేర్కొన్నారు.తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17న ఎందుకు జాతీయ జెండా ఎగరవేయడం లేదో చెప్పాలని మరో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్?ఎస్ పేర్లు మార్చి వేడుకలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అమిత్ షా చొరవ వల్లే కేంద్రం తెలంగాణ విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్న కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఓటు




బ్యాంకు రాజకీయాల కోసం, ఒక వర్గాన్ని సంతృప్తి పరిచేందుకు రాష్ట్ర పాలకులు అధికారికంగా వేడుకల్ని నిర్వహించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గల్లీ గల్లీలో జాతీయ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ విమోచనంపై నరేంద్ర మోదీ వ్యాఖ్యలు

- సర్దార్ పటేల్ ఉక్కు సంకల్పం వల్లే హైదరాబాద్ విలీనం సాధ్యమైందని వెల్లడి
- గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని దశాబ్దాలుగా విస్మరించాయని విమర్శ
- తమ ప్రభుత్వం వచ్చాకే ఈ వేడుకను చిరస్మరణీయం చేసిందని వ్యాఖ్య



హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అందించిన సేవలను స్మరించుకున్నారు. నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో జరిగిన దారుణాలను ఆయన గుర్తుచేశారు. దశాబ్దాల పాటు గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని విస్మరించాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఈ విజయాన్ని చిరస్మరణీయం చేసిందని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో బుధవారం జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. "ఈ రోజు, సెప్టెంబర్ 17, ఒక చారిత్రకమైన రోజు. సరిగ్గా ఇదే రోజున దేశం సర్దార్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని చూసింది. భారత సైన్యం హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించి, భారతదేశ గౌరవాన్ని పునఃస్థాపించింది" అని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ విమోచన దినం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. "భారతమాత గౌరవం, ప్రతిష్ఠల కంటే ఏదీ గొప్పది కాదు" అని మోదీ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాల తీరును పరోక్షంగా విమర్శిస్తూ, "దశాబ్దాలు గడిచిపోయినా ఈ చారిత్రక విజయాన్ని ఎవరూ పెద్దగా జరుపుకోలేదు. కానీ మా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చిరస్మరణీయం చేసింది. మేము ఈ రోజును 'హైదరాబాద్ విమోచన దినం'గా జరపడం ప్రారంభించాం. ఈ రోజు హైదరాబాద్‌లో ఈ వేడుకను ఎంతో గర్వంగా జరుపుకుంటున్నారు" అని తెలిపారు.

1948 సెప్టెంబర్ 17న నాటి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలలో జాతీయ జెండాను ఎగురవేస్తారు.

# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయ యవనికపై మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించారు. 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (టీఆర్పీ) పేరుతో తమ పార్టీని ప్రజల ముందుకు తీసుకొచ్చినట్టు ఆయన అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కూడా తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. ఎరుపు, ఆకుపచ్చ రంగుల కలయికతో ఈ జెండాను రూపొందించారు. పార్టీ స్థాపనతో పాటు, కీలకమైన రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఆయన ప్రకటించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా తీన్మార్ మల్లన్న బాధ్యతలు చేపట్టనున్నారు.

పార్టీ కార్యకలాపాలను ముందుకు నడిపించేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మాదం రజినీ కుమార్ యాదవ్, సూదగాని హరిశంకర్ గౌడ్‌లను నియమించారు. అలాగే, పార్టీ ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి అవకాశం కల్పించారు. వట్టే జానయ్య యాదవ్,




సంగెం సూర్యారావు, పల్లెబోయిన అశోక్ యాదవ్, జ్యోతి పండల్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమిస్తున్నట్టు మల్లన్న వెల్లడిరచారు. త్వరలోనే పార్టీలో యువతకు పెద్దపీట వేస్తామని తెలిపారు. మిగిలిన విభాగాలకు సంబంధించిన కార్యవర్గాలను కూడా త్వరలోనే ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# హైడ్రాలో ఘనంగా ప్రజాపాలనా దినోత్సవం


- జాతీయ జెండాను ఆవిష్కరించిన కమిషనర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ దిశానిర్దేశం చేశారు. ప్రజల సాధకబాధలను అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించే విధంగా అందరూ పని చేయాలని సూచించారు. హైడ్రా కార్యాలయంలో ప్రజాపాలనా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి.. జాతీయ జెండాను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. 1948, సెప్టెంబరు 17న భారత ప్రభుత్వంలో హైదరాబాద్ రాష్ట్రం విలీనమైన సందర్భాన్ని, నాటి పోరాటాన్ని కమిషనర్ వివరించారు. ప్రజాపాలనకు హారతి పట్టిన రోజుగా సెప్టెంబరు 17ను అభివర్ణించారు. అందుకే సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజాభీష్టం మేరకు పాలన సాగించాలని.. అప్పుడే వారి మన్ననలు, మద్దతు పొందగలమన్నారు. ఇందుకు హైడ్రాలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని.. వారి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని సూచించారు. ప్రజాపాలన దినోత్సవం ముఖ్య ఉద్దేశం కూడా ఇదేనని అన్నారు. అందరికీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## బ్రేక్‌ఫాస్ట్‌లో బ్రెడ్ తినే అలవాటు ఉందా?



బ్రేక్ ఫాస్ట్.. రోజులో మొదటి భోజనం కాబట్టి వీలైనంత వరకు పోషకాహారం తీసుకోవడానికి ప్రాధన్యత ఇస్తారు. అయితే బ్రేక్ ఫాస్ట్‌లో బ్రెడ్ కూడా తీసుకోవడం చాలా మందికి అలవాటు. నేటి వేగవంతమైన జీవితంలో అధిక మంది బ్రేక్ ఫాస్ట్ గా బ్రెడ్ తినడానికి ఇష్టపడుతున్నారు. రోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్ తీసుకునే అలవాటు దాదాపు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఇది రోజులో మొదటి భోజనం కాబట్టి వీలైనంత వరకు పోషకాహారం తీసుకోవడానికి ప్రాధన్యత ఇస్తారు. అయితే బ్రేక్ ఫాస్ట్‌లో బ్రెడ్ కూడా తీసుకోవడం చాలా మందికి అలవాటు. నేటి వేగవంతమైన జీవితంలో అధిక మంది బ్రేక్ ఫాస్ట్ గా బ్రెడ్ తినడానికి ఇష్టపడుతున్నారు. బ్రెడ్ లో అనేక రకాలు ఉన్నాయి. వాటిలో వైట్ బ్రెడ్, బ్రౌన్ బ్రెడ్, మల్టీగ్రెయిన్ బ్రెడ్ ఉన్నాయి. అయితే ఖాళీ కడుపుతో బ్రెడ్ తింటే ఏమి జరుగుతుందో, ఎంత వరకు ప్రయోజనకరంగా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. బ్రెడ్.. ముఖ్యంగా వైట్ బ్రెడ్ లో ఫైబర్ తక్కువగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను బలహీనపరుస్తుంది. బ్రెడ్ తినడం వల్ల జీవక్రియ ప్రక్రియ మందగిస్తుంది. దీనివల్ల మీ ప్రేగులలో ఆహారం పేరుకుపోతుంది. ఫలితంగా మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. తెల్ల బ్రెడ్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది. అంటే బ్రెడ్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలు తరచుగా పెరగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అధిక గ్లైసెమిక్ సూచిక త్వరగా ఆకలి వేసేలా చేస్తుంది. ఇది మరింత తినాలనే కోరికను కలిగిస్తుంది. ఇది మీ బరువును ప్రభావితం చేస్తుంది. తెల్ల బ్రెడ్‌లో సోడియం ఎక్కువగా ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో సోడియం అధికంగా ఉన్న ఆహారాన్ని తినడం వల్ల ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. బ్రెడ్‌కి బదులుగా అల్పాహారంగా ఓట్స్, గుడ్లు, పండ్లు, కూరగాయలు తినవచ్చు. ఇది మీకు ఫైబర్, ప్రోటీన్, పుష్కలంగా విటమిన్లు, ఖనిజాలను అందిస్తుంది. కడుపు నిండుగానూ ఉంచుతుంది. ముఖ్యంగా బ్రేక్ ఫాస్ట్‌కి తీసుకునే అల్పాహారాన్ని పోషకమైనదిగా, సులభంగా జీర్ణమయ్యేలా చేసుకోవాలి. ఒక వేళ బ్రెడ్ తినవలసి వస్తే, దానిని తక్కువ పరిమాణంలో, వేరే ఏదైనా తిన్న తర్వాత తినడం మంచిది.

## గ్యాస్ సమస్యలు లేకుండా ఉండాలా?

ఉదయం లేవగానే చాలామందికి పొట్ట సంబంధిత సమస్యలు వస్తుంటాయి. కొంతమందికి అల్పాహారం తీసుకున్న తర్వాత గ్యాస్, ఉబ్బరం లాంటి సమస్యలు మొదలవుతాయి. ఇక ఉదయాన్నే ఆఫీసులకు వెళ్లి పనిచేసేవారికి ఇది పెను సమస్యే. అందుకే ఉదయం తినే టిఫిన్ లో ఈ చిన్న మార్పులు చేసుకుంటే మీ పొట్ట ప్రశాంతంగా ఉంటుందట. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథీ దీనికి ఒక సులభమైన పరిష్కారం చెప్పారు. అల్పాహారం రోజులో చాలా ముఖ్యమైన భోజనం. అందుకే, ఉదయం తీసుకునే మొదటి భోజనం పోషకాలతో నిండి ఉండాలి. అది గ్యాస్, ఉబ్బరం లాంటి సమస్యలను కలిగించకూడదు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథీ ఈ సమస్యలు రాకుండా ఉండేందుకు ఐదు అల్పాహార పదార్థాలు సూచించారు. డాక్టర్ సేథీ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఐదు ఆహారాలు సులభంగా జీర్ణం అవుతాయి. అవి పేగులకు చాలా మంచివి. ఉదయం అంతా శరీరానికి శక్తి అందిస్తాయి. సవర్‌డఫ్ బ్రెడ్: ఈ బ్రెడ్ పులియబెట్టడం ద్వారా తయారవుతుంది. ఈ ప్రక్రియలో దానిలో ఉన్న సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నం అవుతాయి. దానివల్ల



ఇది సులభంగా జీర్ణం అవుతుంది. ఉబ్బరం రాకుండా సహాయపడుతుంది. అరటిపండ్లు: పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తుంది. శరీరంలో నీరు నిల్వ ఉండకుండా నిరోధిస్తుంది. ఉబ్బరం తగ్గించడానికి సహాయం చేస్తుంది. పెరుగు: ఇందులో ప్రోబయోటిక్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన పేగులకు సహాయం చేస్తాయి. గ్యాస్ ఉత్పత్తిని తగ్గించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. పెరుగులో లాక్టోస్ భాగం చాలావరకు జీర్ణమవుతుంది. అవకాడో: అవకాడోలో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. అవి సున్నితమైన జీర్ణక్రియకు సహాయపడతాయి. మలబద్ధకం, ఉబ్బరం రాకుండా నివారిస్తాయి. గ్రీన్ టీ: గ్రీన్ టీలోని కేటెచిన్స్ అనే పదార్థాలు మంటను తగ్గించే గుణాలను కలిగి ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు ఉపశమనం ఇస్తాయి. ఉబ్బరాన్ని తగ్గిస్తాయి.

## ఏబీసీ జ్యూస్ రోజూ తాగుతున్నారా..?

పండ్లు, కూరగాయల జ్యూస్‌లలో పోషకాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి మనల్ని కాపాడతాయి. ఫ్రూట్ జ్యూస్ లు అందరూ తాగుతారు. కానీ.. వాటికంటే ఏబీసీ జ్యూస్ మరింత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ రోజూ ఏబీసీ జ్యూస్ తాగాలని డైటీషియన్లు సూచిస్తున్నారు. ఈ జ్యూస్‌లో శరీరానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఏబీసీ జ్యూస్ తాగడం వల్ల



శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు మెరుగుపడతాయి. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం ఖాళీ కడుపుతో ఈ జ్యూస్ తాగితే శరీరం శుభ్రపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఏబీసీ జ్యూస్ చాలా ఉపయోగపడుతుంది. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. క్యారెట్ లో ఉండే పొటాషియం, ఫైబర్ కడుపు నిండినట్లు ఉంచుతాయి. ఈ జ్యూస్‌లో ఉండే విటమిన్లు, ఖనిజాలు చర్మం సాగే గుణాన్ని తగ్గిస్తాయి. ముఖంపై వచ్చే వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మీ గట్ ఆరోగ్యాన్ని కాపాడటానికి కూడా ఉపయోగపడుతుంది. ఏబీసీ జ్యూస్ తాగడం వల్ల చర్మం మెరుస్తుంది. జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచడానికి, ప్రేగు కదలికలను క్రమబద్ధీకరించడానికి, మలబద్ధకం తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే క్యారెట్లు మీ కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇజ్రాయిల్‌ను ఎదుర్కొవడానికి ఉమ్మడి రక్షణ వ్యవస్థ



పాలస్తీనాలోని గాజాలో అమాన వీయ దాడులకు తెగబడుతున్న ఇజ్రాయిల్‌ను తిప్పికొట్టేందుకు ఉమ్మడి రక్షణ వ్యవస్థను పునరుద్ధరించాలని అరబ్, ఇస్లామిక్ దేశాలు నిర్ణయించాయి. ఖతార్ రాజధాని దోహాలో ఆయా దేశాల నేతలతో ఏర్పడిన గల్ఫ్ సహకార మండలి (జిసిసి) దోహాలో సమావేశమైంది. ఉమ్మడి రక్షణ వ్యవస్థను తిరిగి క్రియాశీలకం చేయాలని నిర్ణయించింది. దోహాలో హమస్ నేతలపై ఇజ్రాయిల్ జరిపిన దాడులు నమ్మకద్రోహంతో కూడిన పిరికిపంద చర్య అని ఖతార్ ఎమిర్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి జిసిసి భాగస్వామ్య దేశాలైన కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) దేశాధినేతలు, ప్రతి నిధులు హాజరయ్యాయి. సభ్య దేశాలు భద్రతా పరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిసిసి ఓ రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సమావేశం ప్రారంభోత్సవం సందర్భంగా షేక్ తమిమ్ మాట్లాడుతూ 'మా దేశ రాజధానిలో హమాస్ నేతల కుటుంబాలు, ఆ నేతల చర్చల ప్రతినిధి బృందం నివసిస్తున్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని నమ్మకద్రోహంతో దాడి చేశారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజాలో కాల్పుల విరమణ పాటించే విషయంపై అమెరికా చేసిన తాజా ప్రతిపాదనపై చర్చించడానికి హమాస్ నేతలు దోహాలో సమావేశమవ్వగా..వారిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ వైమానిక దాడి జరిపిన సంగతి తెలిసిందే. ఈ నెల 9న జరిగిన ఆ దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్ ప్రభుత్వ అధికార వ్యామోహం, అహంకారం, రక్తపిపాసను నిలువరించడానికి ధృఢమైన చర్యలు తీసుకోవాల్సిందేనని తమిమ్ పిలుపునిచ్చారు. మధ్యవర్తులపై ఇజ్రాయిల్ జరిపిన దాడిని చూస్తుంటే దానికి శాంతి స్థాపనపై నిజంగా ఆసక్తి లేదని స్పష్టమవుతోం దన్నారు. గాజాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలను అడ్డుకోవాలన్నదే దాని తాపత్రయంగా కనిపి స్తోందని చెప్పారు.ఇజ్రాయిల్ ఈ ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే లెబనాన్, సిరియా, ఎమన్‌పై బాంబు దాడులు చేస్తోందని ఖతార్ ఎమిర్ తమిమ్ పేర్కొన్నారు.



# గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడిరది

ఇజ్రాయిల్ గాజాలో ఊచకోతకు పాల్పడిరదని ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ మంగళవారం నిర్ధారించింది. గాజాలో మారణహోమానికి ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ సహా ఉన్నతాధికారులు ప్రోత్సహించారని తేల్చింది. ఊచకోత నిర్ధారణకు పౌర హత్యల స్థాయి, సాయాన్ని అడ్డుకోవడం, బలవంతంపు స్థానభ్రంశం, సంతానోత్పత్తి కేంద్రాలను ధ్వంసం చేయడం వంటి వాటిని ఉదాహరణలుగా పేర్కొంది. ''గాజాలో ఊచకోత జరిగింది'' అని ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై విచారణ కమిషన్ చీఫ్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు మాజీ న్యాయమూర్తి నవీ పిళ్లే అన్నారు. ఈ క్రూరమైన హత్యలకు ఇజ్రాయిల్ ఉన్నతాధికారులతే బాధ్యత. గత రెండేళ్లుగా గాజాలోని పాలస్తీనా ప్రజలను నాశనం చేయాలనే నిర్దిష్టమైన ఉద్దేశంతో మారణహోమాన్ని వారు ప్రోత్సహిస్తున్నారని అన్నారు. కమిషన్ ప్రకటించిన 72 పేజీల చట్టపరమైన విశ్లేషణ ఇప్పటివరకు ఐరాస వెల్లడిరచిన వాటిలో అత్యంత బలమైనది. నెతన్యాహూ మరియు ఇతర అధికారుల ప్ర కటనలు '' ఉద్దేశపూర్వక జాతిహత్యకు ప్రత్యక్ష ఆధారాలు'' అని కమిషన్ తేల్చింది. ''గాజా ఆపరేషన్ హిబ్రూబైబిల్‌లో పేర్కొన్నట్లు సంపూర్ణ వినాశనానికి సంబంధించిన పవిత్ర యుద్ధం''గా 2023 నవంబర్‌లో ఇజ్రాయిల్ సైన్యానికి రాసిన లేఖను కమిషన్ ఉదహరించింది. ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాగ్ హెర్జోగ్, మాజీ రక్షణ మంత్రి యోఫ్ గాల్లంట్ పేర్లను కూడా పేర్కొంది. 1994 రువాండా మారణహోమంలో 10లక్షలకు పైగా ప్రజలు మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ.. గాజాలో పరిస్థితులు అప్పటి మారణహోమానికి చాలా దగ్గరగా ఉన్నాయని పిళ్లె పేర్కొన్నారు. బాధితులను అమానవీయంగా చూస్తారని, వారిని జంతువులుగా భావిస్తారని, అందుకే మనస్సాక్షి లేకుండా హత్య చేస్తారని అన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం తన 2024 అత్యవసర చర్యల ఉత్తర్వుల్లో.. గాజాలో పాలస్తీనియన్ల హత్యకు ఇజ్రాయిల్‌ను నిర్ధారించినప్పటికీ.. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ పేరును ప్రస్తావించలేదు. తమ నివేదిక ఫలితంగా.. ఇతర దేశాల మనస్సులు కూడా తెరుచుకోవచ్చని తాను ఆశిస్తున్నానని పిళ్లె అన్నారు. ఈ మారణహోమాన్ని నిరసిస్తున్న అంతర్జాతీయ సంస్థలు, పలు హక్కుల సంఘాల గొంతుకలకు తాజాగా ఐరాస హక్కుల సంస్థ తన స్వరాన్ని కూడా జోడిరచింది. ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్‌కు సహకరించేందుకు ఇజ్రాయిల్ నిరాకరించింది.

# ఎసిబి విజయవాడ యూనిట్‌లో కేసుల కొట్టివేతపై సుప్రీం ఆగ్రహం



న్యూఢల్లీ: ఎసిబి విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌లో నమోదైన కేసులను గంపగుత్తగా కొట్టివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు పోలీసు స్టేషన్ హోదా లేదని ఇటీవల కేసులను ఎపి హైకోర్టు క్వాష్‌చేసింది. దీనిని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పుపై అసహనం వ్యక్తం చేసింది.ఇంత దారుణంగా కూడా చట్టాలను అన్వయించుకుంటారా? అని ప్రశ్నించింది. ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు? దర్యాప్తు ఏం జరుగుతుందో కూడా చూడకుండా కేసులు కొట్టేయడమేంటని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఎసిబి నమోదు చేసిన అక్రమాస్తుల కేసులను ఇలా ఏకపక్షంగా కొట్టేయడమేంటని పేర్కొంది. ప్రతివాదులకు నోటీసులిచ్చిన ధర్మాసనం, హైకోర్టు ఉత్తర్వులు మరో ఏ ఒక్క కేసుకు అమలు కావని స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న 11 ఎఫ్ఐఆర్‌లపై తదుపరి విచారణ కొనసాగించి చార్జిషీట్‌లు దాఖలు చేసేందుకు అనుమతినిస్తూ మధ్యంతర ఆదేశాలను ధర్మాసనం ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ న్యాయవాది సిద్ధార్ధ లూథ్రా వాదనలు వినిపించారు. విజయవాడలో యూనిట్ ఏర్పాటుచేసి, తదుపరి కార్యకలాపాలు సాగించేందుకు ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు పరిగణనలోకి తీసుకున్న

# మతమార్పిళ్లు 'మోసపూరితం' అని తేల్చేదెవరు..?

న్యూఢల్లీ: మత మార్పిళ్లు 'మోసపూరితమైనవి' అని కచ్చితంగా నిర్ధాంచి చెప్పగలిగే వారెవ్వరని ఇందుకు సంబంధించి పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయుని సుప్రీంకోర్టు నిలదీసింది. దీనిపై తమ వివరణ తెలియాలని నాలుగు వారాల గడవునిస్తూ సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా మోసపూరిత మత మార్పిళ్లపై సంపూర్ణ నిషేదం విధించాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో మత మార్పిళ్లకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవారు, న్యాయమూర్తి కె వినోద్ చంద్ర నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. 'మోసపూరిత మత మార్పిళ్ల'ను నిర్ధారించేవారెవ్వరని న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయుని ప్రశ్నించింది. ఒకవేళ రెండు విశ్వాసాలకు చెందిన జంట..మతాంతర వివాహం చేసుకుంటే అది మోసపూరితమైన మత మార్పిడిగా నిర్ధాంచేవారెవ్వరని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించారు. మత మార్పిళ్ల చట్టాల చెల్లుబాటును ప్రశ్నించిన ఒక ఎన్‌జిఒ తరపు సీనియర్ న్యాయవాది సిపి సింగ్ వాదనలతో ఈ సందర్భంగా జస్టిస్ బిఆర్ గవారు ఏకీభవించారు. న్యాయస్థానం చట్టాల రాజ్యాంగ బద్ధతను పరిశీలిస్తుందే కానీ, చట్టాలను రూపొందించడానికి కాదని స్పష్టం చేశారు. దీంతో వెనక్కి తగ్గిన న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయు తాను తన పిటిషన్‌ను కేవలం ప్రలోభాలకు గురి చేయడం, నకిలీ మత మార్పిళ్లకు వ్యతిరేకంగానే దాఖలు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణ 25 ప్రకారం.. ప్రజలందరికీ మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉందని, కానీ మోసం లేదా బలవతంగా మతం మార్చరాదని ఆయన చెప్పారు. ఈ సందర్భంలో జోక్యం చేసుకున్న జస్టిస్ బిఆర్ గవారు మత మార్పిడి మోసపూరితమైనదా? కాదా? అని ఎవరు నిర్ధారిస్తారు అని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది వృందా గ్రోవర్‌తో కలిసి హాజరైన సిపి సింగ్ వాదనలు వినిపిస్తూ..ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార?ండ్, కర్ణాటక తదితర రాష్ట్రాలు ఒకదాని తర్వాత ఒకటి మక్కికి మక్కి పద్ధతిలో మోసపూరిత మత మార్పిళ్లకు వ్యతిరేకంగా 'మత స్వేచ్ఛ' పేరిట చట్టాలను తీసుకొచ్చాయని, వాస్తవానికి ఆ చట్టాలల్లో 'స్వేచ్ఛ' అనేది లేదని పేర్కొన్నారు. ఇటీవల ఇదే తరహాలో రాజస్థాన్ కూడా ఒక చట్టాన్ని తీసుకొస్తోందని తెలిపారు. మోసపూరిత మత మార్పిళ్లకు వ్యతిరేకంగా ఆ చట్టాలు తీసుకురావడం లేదని, మత మార్పిళ్లను అడ్డుకోవడమే వాటి లక్ష్యమని పేర్కొన్నారు.

# న్యూయార్క్ టైమ్స్‌పై ట్రంప్ కక్షసాధింపు



అమెరికాకు చెందిన ప్రసిద్ధ వార్తా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్'పై ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారు. ఈ సంస్థపై ఫ్లోరిడా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల మేరకు పరువు నష్టం దావా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పత్రిక తనను ఎంతగానో దూషించిందని, అపవాదలు మోపిందని ఆయన పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసిన డెమొక్రాట్ కమలా హారిస్‌ను సమర్థిస్తూ న్యూయార్క్ టైమ్స్ తన మొదటి పేజీలో ఓ వార్తను ఒదించింది. అంతకుముందు ఎవరూ వినని విషయం. నన్ను, నా కుటుంబాన్ని, వ్యాపారాన్ని, అమెరికా ఫస్ట్ మూవ్‌మెంట్‌ను, మాగాను%ౌ%మొత్తంగా మన దేశాన్ని గురించి చాలా కాలంగా అబద్ధాలు చెబుతోంది' అని ట్రూత్ సోషల్ పోస్టులో ట్రంప్ రాసుకొచ్చారు. డెమొక్రాట్ పార్టీకి 'న్యూయార్క్ టైమ్స్' గొంతుకలా మారిందని విమర్శించారు. రిపబ్లికన్ల నేతృత్వంలో జరుగుతున్న ఉద్యమాలు, అమెరికా ఫస్ట్ మూవ్‌మెంట్, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) వంటి భావజాలాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందన్నారు. కాగా ట్రంప్ వ్యాఖ్యలపై న్యూయార్క్ టైమ్స్ నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.

# శాంతి చర్చలకు వచ్చేవారం భేటీకాన్ను ట్రంప్ - జెలెన్‌స్కీ



రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఆపడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమర్ జెలెన్‌స్కీతో ట్రంప్ వచ్చేవారం భేటీకానున్నారు. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మంగళవారం తెలిపారు. యుద్ధాన్ని ఆపకపోతే రష్యాపై ఆంక్షలు విధిస్తామని ట్రంప్ పదేపదే బెదిరిస్తున్నప్పటికీ పుతిన్ మాత్రం వాటిని ఏమాత్రం లెక్కచేయడం లేదు. తాజాగా ఈ విషయంపై రూబియో ఇజ్రాయిల్ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ట్రంప్ రష్యా ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని పలు మార్లు పుతిన్‌తో చర్చలు జరిపారు. అలాగే జెలెన్‌స్కీతోపాటు పలుమార్లు సమావేశం కానున్నారు. బహుశా వచ్చేవారం న్యూయార్క్‌లో ట్రంప్ జెలెన్‌స్కీతో భేటీ కానున్నారు. ఒకవేళ ఆయన ఇరు దేశాల నేతలతో శాంతి చర్చలు జరిపి యుద్ధాన్ని ఆపితే.. ట్రంప్ సాధించిన విజయమే. బహుశా ఇది సాధ్యం కాదు అనేంతవరకు ట్రంప్ ప్రయత్నిస్తూనే ఉంటారు' అని ఆయన అన్నారు. యుద్ధం వల్ల కేవలం జూలై నెలలో రష్యా 20 వేల మంది సైనికుల్ని కోల్పోయిందని ట్రంప్ చెప్పినదాన్ని రూబియో సందర్భంగా ఎత్తిచూపారు. రష్యా, ఉక్రెయిన్, యూరోపియన్లతో కూడా సమర్థవంతంగా మాట్లాడే నేత ట్రంప్. ఇరు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపే వ్యక్తి కూడా ఆయనే. శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించగల నేత ఆయనే. ప్రపంచంలో ఇంకెవరు లేరు అని రూబియో అన్నారు.

# ఉత్తరాఖండ్, హిమాచల్ కకావికలం



ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో కకావికల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 15న సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు పలుమార్లు కుంభవృష్టి సంభవించడంతో మెరుపు వరదలతో ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. ప్రధానంగా డెహ్రాడున్, రారుపుర్, రిషికేశ్ వంటి ప్రాంతాల్లో భారీ వర్షాలతో పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మట్టిచరియలు, కొండ చరియలు విరిగిపడటంతో రహదారులు ధ్వంసమయ్యాయి. రాకపోకలు స్తంభించాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడ చిక్కుకుపోయాయి. ఈ ఘటనల్లో 500 మంది వరకు వరద నీటిలో చిక్కుకోగా..సహాయక బృందాలు రక్షించాయి. అయితే వేర్వేరు చోట్ల జరిగిన ఘటనల్లో ఎనిమిది మంది చనిపోయారని, మరో 20 మంది గల్లంతయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. డెహ్రాడున్‌లోని పవుంధా ప్రాంతంలో దేవ్‌భూమి ఇనిస్టిట్యూట్ వరద నీటిలో చిక్కుకుపోవడంతో అందులోని 200 మంది విద్యార్థులను రాష్ట్ర విపత్తు నివారణ బలగాలు (ఎస్‌డీఆర్‌ఎఫ్) రక్షించాయి. రిషికేశ్‌లోని చంద్రభాగ నది ఉప్పొంగి ప్రవహించడంతో హైవే పైకి నీరు చేరింది. భారీ వాహనాలు కూడా వరద నీటిలో చిక్కుకున్నాయి. వరద బాధిత ప్రాంతాలను మంగళవారం ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పరిశీలించారు. పెను విపత్తు నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in